క్లుప్తంగా

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక



పమిడిముక్కల: అవనిగడ్డలో ఇటీవల జరిగిన జిల్లా స్థాయి కబడ్డీ పోటీల్లో తాడంకి హైస్కూల్ విద్యార్థిని నీలపు విజయలక్ష్మి ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం వైఎస్ఎన్ ప్రసాద్ తెలిపారు. డిశంబర్ 5, 6, 7, 8 తేదీలలో ప్రకాశం జిల్లా సంతనూతలపాడులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో విజయలక్ష్మి పాల్గొంటారని చెప్పారు. హైస్కూల్‌లో గురువారం జరిగిన కార్యక్రమంలో విద్యార్థిని, శిక్షణ ఇచ్చిన పీఈటీ రవీంద్రబాబు, పీడీ రాజులను హెచ్ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.

శ్రీశైలానికి పాదయాత్ర

మండవల్లి: మండవల్లికి చెందిన పెద్దిరాజు అనే భక్తుడు శివదీక్ష తీసుకుని గురువారం శ్రీశైలానికి పాదయాత్రగా బయలుదేరాడు. శివదీక్షతో శ్రీశైలం మల్లేశ్వరస్వామి ఆలయానికి కాలినడకన వస్తానని మొక్కుకున్న నేపథ్యంలో మండవల్లి శ్రీ భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి ఆలయంలో ఇరుముడి కట్టుకుని పాదయాత్ర ప్రారంభించాడు. డిసెంబర్ 5న దీక్ష విరమించనున్నాడు.

ఆక్రమణలు తొలగించాలని వినతి

ముదినేపల్లి రూరల్: మండలంలోని ఊటుకూరు ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న ఆక్రమణలు తొలగించాలని సర్పంచ్ సుధాబత్తుల వరలక్ష్మి కోరారు. ఈ మేరకు తహసీల్దార్ ఎ.సుభానికి గురువారం వినతిపత్రం అందజేశారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ ఊటుకూరు నుంచి మలపరాజుగూడెం వరకు ఆర్అండ్‌బీ రహదారి నిర్మాణానికి నిధులు మంజూరైనట్లు చెప్పారు. ఈ రహదారికి ఇరువైపులా ఆక్రమణలు ఉన్నందున రోడ్డు నిర్మాణానికి ఆటంకం కలుగుతుందన్నారు. ఇందుకు సంబంధించి పూర్తిస్థాయిలో రహదారి సర్వే చేయించి ఆక్రమణలు తొలగించాలని కోరారు.

పీహెచ్‌సీలో మలేరియా అధికారి తనిఖీ



మండవల్లి: జిల్లా మలేరియా అధికారి సీఎస్ఎస్ ప్రసాద్ గురువారం మండల్లి మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. వైద్యాధికారి డాక్టర్ సుమను జ్వరాల కేసుల గురించి, వాటి నిర్మూలనకు తీసుకున్న జాగ్రత్తల గురించి అడిగి తెలుసుకున్నారు. ల్యాబ్ టెక్నీషియన్ సురేష్‌ను అడిగి రిపోర్ట్స్‌ను పరిశీలించారు. ఆస్పత్రి ప్రాంగణంలో నీరు నిల్వ ఉన్న ప్రాంతంలో ద్రావణాన్ని పిచికారీ చేయాలని సూచించారు. ఫీల్డ్ విజిట్‌లో భాగంగా లింగాల సచివాలయ పరిధిలోని గ్రామాలను పరిశీలించారు. రహదారులపై నీరు నిల్వ ఉండకుండా చర్య తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. సీహెచ్ఓ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

తొలగిన ట్రాఫిక్ సమస్య

ముదినేపల్లి రూరల్: స్థానిక సంతమార్కెట్ సమీపంలో ఎట్టకేలకు ట్రాఫిక్ సమస్య తొలగింది. సంత సమీపంలోని రోడ్డును ఇరువైపులా ఆక్రమించడంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడింది. ప్రతి సోమవారం వారపు సంత రోజున ఈ సమస్య మరింత తీవ్రంగా ఉంటుంది. రహదారిపై వరకు షాపులు ఏర్పాటుచేసి పలువురు వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. వీటిని తొలగించి ట్రాఫిక్ సమస్య పరిష్కరించాలని పంచాయతీ అధికారులను స్థానికులు ఎప్పటి నుంచో కోరుతున్నారు. ఎట్టకేలకు స్పందించిన అధికారులు రహదారికి ఇరువైపులా ఉన్న దుకాణాలను బుధ, గురువారాల్లో తొలగించారు. రహదారికి మరో పక్కన చెత్తను వేస్తుండడంతో దుర్వాసన వెదజల్లి ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఈ సమస్యను సైతం తొలగించేందుకు త్వరలోనే కంచెను ఏర్పాటు చేస్తామని కార్యదర్శి రమేష్ తెలిపారు.

హనుమాన్ చాలీసా పారాయణం

మండవల్లి: మండవల్లిలో గురువారం హనుమాన్ చాలీసా పారాయణం మెతుకుల సత్యనారాయణ ఇంటి వద్ద భక్తులు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. సరికొత్త విధానంలో 108 సార్లు పారాయణం చేశారు. కరేటి శ్రీనివాస్, కరేటి చిరంజీవి, ఆగొల్లు సత్యనారాయణ, బుర్ల భోగేశ్వరరావు, సత్యం స్వామి తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ దినోత్సవ ర్యాలీ

పెడన: రాజ్యాంగ దినోత్సవం పురస్కరించుకుని పట్టణంలోని బంగ్లా స్కూల్ విద్యార్థులతో కలిసి ఎంఈవో-2 వై.హరనాథ్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక ఎమ్మార్సీ కేంద్రంలో మండల స్థాయిలోని విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించారు. ప్రథమ స్థానంలో నిలిచిన వారు జిల్లా స్థాయిలో శుక్రవారం జరిగే పోటీలకు హాజరు కావాల్సి ఉంటుందని ఎంఈవో తెలిపారు. కార్యక్రమంలో బంగ్లాస్కూలు హెచ్ఎం భాగ్యలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమన్వయలోపం..

అభివృద్ధి పనులకు శాపం

- గుడ్లవల్లేరు మండలానికి రూ.కోట్లలో నిధుల కేటాయింపు
- సమన్వయం లేక పట్టించుకోని అధికారులు
- పని చేయాలంటున్న ప్రజలు



నిర్మాణాలు త్వరగా చేయాలని మండల సమావేశంలో ఆదేశిస్తున్న ఎంపీడీఓ విజయసారథి (ఫైల్)

గుడ్లవల్లేరు: కోట్లాది రూపాయలు జిల్లా పరిషత్ నిధులు వినియోగించక పోవటంతో కొద్ది రోజుల్లో గడువు ముగిసి కాల దోషం పట్టనుంది. అధికారుల మధ్య సమన్వయ లోపమే ఇందుకు కారణం. వైఎస్సార్ సీపీ తరపున గుడ్లవల్లేరు మండలంలో జెడ్పీటీసీగా పోటీ చేసిన ఉప్పాల హారిక చరిత్రలో ఎన్నడూ లేని విధంగా అప్పట్లో అత్యధిక మెజార్టీతో గెలిపించి ఆమె పట్ల మండల ప్రజలు తమ అభిమానాన్ని చాటుకున్నారు. హారిక అప్పట్లో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి దీవెనలతో ఉమ్మడి కృష్ణా జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌గా ఎన్నికయ్యారు.

కోట్లలో నిధుల కేటాయింపు..

గుడ్లవల్లేరు మండలంలో వివిధ అభివృద్ధి పనులకు కోట్లాది రూపాయల జెడ్పీ నిధులను కేటాయించారు. ఉమ్మడి కృష్ణాజిల్లాలోని ఏ మండలంలో ఈ విధంగా నిధులు ఏ ఒక్క ప్రజాప్రతినిధి కేటాయించలేదని విమర్శకుల నుంచి కూడా జెడ్పీ చైర్‌పర్సన్ హారిక మన్ననలు అందుకుంటున్నారు.

సమన్వయం లేక..నిధులు వాడక..

కానీ అధికారులు మాత్రం ఒకరికొకరికి సరిగా సమన్వయం లేక ఆ నిధుల ప్రజా వినియోగానికి కేటాయించిన నిధుల్ని పట్టించుకోకుండా కాలం వెలిబుచ్చుతున్నారు. మండలంలోని 22 గ్రామ పంచాయితీల్లో 25 మైక్రో వాటర్ ఫిల్టర్ల నిర్మాణానికి రూ.1.50 కోట్ల జెడ్పీ నిధులతో 12 మైక్రో వాటర్ ఫిల్టర్ల నిర్మాణం పూర్తయ్యాయి. ఇంకా నిర్మాణాలు జరగవలసి ఉంది. కానీ ఆ పనులు ఇంకా అమలుకు నోచుకోలేదు. మండలంలో శ్మశాన వాటికల్లో దహన సంస్కారాల భవనాలను నిర్మించేందుకు నిధులను కేటాయించారు. అధికారుల పుణ్యమా అని ఇంత వరకు కార్యరూపం దాల్చలేదు. 24 గ్రామాల్లో ఒక్కో గ్రామానికి రూ.5 లక్షల చొప్పున రూ.1.20 కోట్ల నిధులు కేటాయించినా .. అధికారులు అభివృద్ధి చేయకుండా తాత్సారం చేస్తూ .. నిధులను పక్కన పెట్టేశారు.



అంగలూరులో నిర్మించిన మైక్రో వాటర్ ఫిల్టర్

మండల సమావేశంలో హెచ్చరించినా..

ఈ ఏడాది డిసెంబరుకు ఈ నిధుల వినియోగ సమయానికి కాలం చెల్లనుంది. ఈ విషయమై ఇన్‌చార్జి ఎంపీడీఓ టి.విజయసారిథి సంబంధిత అధికారులను ఈ నెల 8న జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో హెచ్చరించారు. అయినా ఈనాటికి కూడా గ్రామాల నుంచి ప్రతిపాదనలు పంపటం గానీ, పనుల అంచనాలు తయారు చేయటం పూర్తి స్థాయిలో జరగలేదు.

అధికారుల తీరు ఇలా..

ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రూపేష్ నందివాడలో ఆ శాఖకు ఏఈగా పని చేస్తున్నారు. ఆయన్ను గుడ్లవల్లేరు మండలానికి ఇన్‌చార్జిగా నియమించారు. రెండు చోట్ల ఆయనకు పని ఒత్తిడి ఎక్కువ కావటంతో పనులు కుప్పలు తెప్పలుగా మేటేసుకుపోతున్నాయి. రూపేష్‌కు గత ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కోన శివాజీ పూర్తి స్థాయిలో బాధ్యతలు అప్పగించక పోవటంతో పరిస్థితి మరింత జఠిలమైంది. కొత్తగా వచ్చిన పంచాయితీరాజ్ ఏఈ నాగేశ్వరరావు మాత్రం ప్రస్తుతం అంచనాలను సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికైనా ఆ నిధులను ప్రజా ప్రయోజనాలకు వినియోగిస్తే.. మండలంలో మరింత అభివృద్ధికి నిధులను మంజూరు చేసేందుకు జెడ్పీ చైర్‌పర్సన్ హారిక సంసిద్ధత వ్యక్తం చేస్తున్నారు.

పనుల నిర్వహణకు ఆదేశించాం..



మండలంలో మిగిలిన మైక్రో వాటర్ ఫిల్టర్ల నిర్మాణంతో పాటు శ్మశాన వాటికల్లో దహన సంస్కారాల 24 భవనాలను నిర్మాణం చేసేందుకు సంబంధితాధికారులను ఆదేశించాం. జెడ్పీ నిధులు వెనక్కి వెళ్లకుండా చర్యలు తీసుకుని మండలంలోని కేటాయించిన అన్ని నిర్మాణాలను పూర్తి చేసి అభివృద్ధి చేస్తాం.

– టి.విజయసారథి, ఇన్‌చార్జి ఎంపీడీవో, గుడ్లవల్లేరు

బాధితుడికి రూ.1.40 లక్షలు సాయం



బాధితుడి కుటుంబ సభ్యులకు రూ.1.40 లక్షల సహాయం అందజేస్తున్న యాజమాన్యం

కురుమద్దాలి(పామర్రు): గత రెండు రోజులుగా సంధ్యా ఆక్వా కంపెనీ ఎదురుగా సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాల కారణంగా యాజమాన్యం దిగివచ్చింది. క్షత గాత్రుడి కుటుంబానికి రూ.1.40 లక్షలు వైద్య ఖర్చుల నిమిత్తం గురువారం అందజేశారు. కొడాలి శ్రీనివాసరావు అనే వ్యక్తి సంధ్యా ఆక్వా కంపెనీలో టెక్నికల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. ఈనెల 14న కంపెనీలో పనిచేస్తుండగా ప్రమాదవశాత్తూ తీవ్రంగా గాయపడ్డాడు. యాజమాన్యం బాధితుడిని ఉయ్యూరు వైద్యశాలలో చేర్చి వదిలేశారు. ఈ సంఘటనపై సీఐటీయూ, బిల్డింగ్ వర్కర్స్, ఎలక్ట్రికల్ వర్కర్స్, మోటార్ వర్కర్స్ కార్మికులు గత రెండు రోజులుగా ఆందోళన కార్యక్రమం చేపట్టారు. ఫలితంగా బాధితుడికి యాజమాన్యం సాయం అందించింది. ఈ ప్రమాదానికి సంబంధించిన గ్రూప్ ఇన్సూరెన్సు నగదును కార్మికుడి కుటుంబానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యాక్షుడు ఒడుగు గంగాధర ప్రసాద్, సీహెచ్ రమేష్, సీహెచ్ రామ్మోహన్, బి.అప్పారావు, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు వేము పెదబాబు, క్షతగాత్రుడి కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కృష్ణా మిల్క్ యూనియన్ నిర్ణయం అభినందనీయం



మాట్లాడుతున్న కృష్ణామిల్క్ యూనియన్ జిల్లా సభ్యుడు బొమ్మారెడ్డి కృష్ణారెడ్డి

పామర్రు: పాల ఉత్పత్తి దారులకు లీటరు పాలకు ఇచ్చే ధరను రూ.80 నుంచి రూ.82కు పెంచుతూ విజయవాడ కృష్ణా మిల్క్ యూనియన్ తీసుకున్న నిర్ణయం పాల ఉత్పత్తి దారులకు ఎంతో సంతోషదాయకమని కృష్ణామిల్క్ యూనియన్ జిల్లా సభ్యుడు బొమ్మారెడ్డి కృష్ణారెడ్డి పేర్కొన్నారు. స్థానిక పాల శీతల కేంద్రంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లీటరు పాలలో వెన్నశాతం 10.0 ఉంటే రూ.82 ధర పెంచడం అభినందనీయమన్నారు. జిల్లాలోని పాల ఉత్పత్తి దారులు అందరికీ రెండో విడత బోనస్సుగా రూ.12 కోట్లు ప్రకటించడం ప్రశంసనీయమని అన్నారు. రైతుల ఆర్థిక అభివృద్ధికి యూనియన్ ఎంతగానో తోడ్పాటు అందిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఉంద్రపూడి, పోలవరం, కొత్తపెదమద్దాలి, కనుమూరు, కొండిపర్రు సంఘాల అధ్యక్షులు జె.సుజాత, ఎంవీబీ కుటుంబరావు, కె.సాంబశివరావు, ఎం.నారాయణ, ఎం.సురేష్‌రెడ్డి, పాడి రైతులు పాల్గొన్నారు.

వివిధ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



బహుమతులు పొందిన విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

గుడివాడ టౌన్: స్థానిక షా గులాబ్‌చంద్ ప్రథమ శ్రేణి గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా పలు పోటీల్లో తమ విద్యార్థులు 27 మంది ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించారని విశ్వభారతి ఇంగ్లిష్ మీడియం హైస్కూల్ చైర్మన్ పొట్లూరి శ్రీమన్నారాయణ తెలిపారు. గురువారం పాఠశాల ఆవరణలో బహుమతులు పొందిన విద్యార్థులను అభినందించారు. ఆయన మాట్లాడుతూ విచిత్ర వేషధారణ, చెస్, క్యారమ్స్, వ్యాసరచన, వక్తృత్వ డ్రాయింగ్, దేశభక్తి గేయాలు, మ్యూజికల్ చైర్స్ పోటీలలో విజయం సాధించారన్నారు.



సర్టిఫికెట్లు చూపిస్తున్న విద్యార్థులు

గుడివాడ టౌన్: స్థానిక అక్కినేని నాగేశ్వరరావు కళాశాలలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమం గురువారం నిర్వహించారు. కళాశాల కరస్పాండెంట్ కేఏస్ అప్పారావు కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ విజ్ఞానం నేర్చుకుని వ్యవస్థను మరింత మంచి మార్గంలో పెట్టడానికి పుస్తక పఠనం ఎంతగానో తోడ్పడుతుందన్నారు. ఎక్కువ సమయం పుస్తక పఠనానికి కేటాయిస్తే జ్ఞానవంతులవుతారని అన్నారు. వివిధ పోటీలలో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ప్రిన్సిపాల్ పీజేఎస్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ బీఎస్ఎస్ పద్మజ, గ్రంథాలయ అధికారి సుభాషిణి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాబా ఆలయంలో ప్రత్యేక పూజలు

పామర్రు: స్థానిక సాయినగర్‌లో శ్రీ షిర్డి సాయి మందిరంలో కార్తిక మాసం గురువారం కావడంతో బాబా ఆలయం భక్తులతో కిటకిటలాడింది. తొలుత బాబాకు ఆవుపాలతో అభిషేకాలను నమక చమకాలతో స్నపన కార్యక్రమాలను చేశారు. భక్తులచేత బాబాకు విశేషంగా పూజలు చేయించారు. మధ్యాహ్న హారతి అనంతరం వచ్చిన భక్తులకు అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం వచ్చిన భక్తులు అందరికీ అన్న సమారాధన చేశారు. ఈ కార్యక్రమంలో సుమారు 300 మంది భక్తులు పాల్గొని అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. ఆలయంలో పూజలను ఆలయ అర్చకులు శర్మ ఆధ్వర్యంలో నిర్వహించినట్లు ఆలయ ధర్మకర్త తమ్మా వినోద్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో షిర్డి సాయి భక్త సమాజ సభ్యులు బొమ్మారెడ్డి రామకృష్ణారెడ్డి, మధుసూదనరావు, సాంబశివరావు, మల్లిఖార్జునరావు, రాధాకృష్ణ, వెంకటప్పయ్య, సురేష్ తదితర భక్తులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీల్లో విద్యార్థి ప్రతిభ



ముదినేపల్లి రూరల్: స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ నిర్వహించిన పోటీల్లో మండలంలోని అల్లూరు హైస్కూల్‌కు చెందిన పంతగాని లిఖిత రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు శొంఠి రామోజీరావు గురువారం విలేకరులకు తెలిపారు. హైస్కూల్లో ఆరో తరగతి చదువుతున్న లిఖిత ఇటీవల పల్నాడు జిల్లాలోని కారంపూడిలో నిర్వహించిన అండర్–14 బాలికల రాష్ట్రస్థాయి ఎంపిక పోటీల్లో పాల్గొంది. లిఖిత రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. విద్యార్థిని లిఖితను ప్రధానోపాధ్యాయుడితో పాటు వ్యాయామోపాధ్యాయుడు వి.వెంకటేశ్వరరావు, విద్యా కమిటీ చైర్మన్ శీలం వెంకటశ్యామల తదితరులు అభినందించారు.

మెరుగైన వైద్య సేవలందించాలి

డీఎంహెచ్‌వో పీఎస్ఎస్ ప్రసాద్



రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా వైద్యాధికారి

ముదినేపల్లి రూరల్: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని జిల్లా వైద్యాధికారి పీఎస్ఎస్ ప్రసాద్ అన్నారు. ముదినేపల్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని ప్రసాద్ గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడుతూ సమయపాలన పాటిస్తూ రోగులకు అన్నిరకాల చికిత్సలు సకాలంలో అందించడంతో పాటు ప్రభుత్వం అందిస్తున్న మందులను పంపిణీ చేయాలన్నారు. ఆరోగ్య కేంద్ర పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడేను విధిగా నిర్వహించాలని సూచించారు. రికార్డులు, ల్యాబ్‌లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఏఎంఓ గోవిందు, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాసు, కైకలూరు సబ్‌యూనిట్ అధికారి పీఎస్ఎస్ శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగంపై అవగాహన అవసరం

మండవల్లి: రాజ్యాంగం తెలుసుకుని హక్కులు బాధ్యతలు గుర్తించాలని ప్రతి ఒక్కరూ దీనిపై శ్రద్ధ వహించాలని ఐక్య వేదిక జిల్లా కన్వీనర్ ఎల్ఎస్ భాస్కరరావు, మండల శాఖ అధ్యక్షుడు టి.అప్పారావు అన్నారు. నవంబర్ 26 రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని వారోత్సవాల్లో భాగంగా గన్నవరం కమ్యూనిటీ హాల్ వద్ద గురువారం రాజ్యాంగంపై సమాచార చట్టం–2005పై మండల కార్యదర్శి గంజాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. పి.రంగారావు, ఎస్.పెద్దిరాజు, జి.లక్ష్మి, ప్రభు, రాజేష్ పాల్గొన్నారు.

వైభవంగా సహస్ర దీపార్చన



గుడివాడలో దీపాలతో ఏర్పాటు చేసిన శివలింగం

గుడివాడ టౌన్: స్థానిక మార్కెట్ సెంటర్‌లో శ్రీ అష్టలక్ష్మిగో సహిత వేణుగోపాల స్వామి దేవస్థానంలో సహస్ర దీపార్చన బుధవారం రాత్రి నిర్వహించారు. ఆలయ 3వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని వేడుకలు జరిపామని, భక్తుల సహకారంతో దీపార్చన నిర్వహించినట్లు దేవస్థానం అధ్యక్షుడు పూర్ణచంద్రరావు తెలిపారు. ఈ కర్యాక్రమంలో, జ్యోతుల శ్రీనివాస్, కె. నరసింహరావు, ఎం.గంగరాజు, విశ్వహిందూ పరిషత్ పట్టణ అధ్యక్షురాలు కుమారి, జ్యోతుల సత్యవేణి తదితరులు పాల్గొన్నారు.

మండవల్లి: మండవల్లిలో ఉన్న శ్రీ భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి ఆలయంలో కార్తికమాసం సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో చేరి గురువారం భ్రమరాంబ దేవికి, మల్లేశ్వరస్వామికి ఘనంగా పూజలు చేశారు. లింగాల శ్రీవిశ్వేశ్వరస్వామికి ఆలయ అర్చకులు పూజలు చేశారు.



మండవల్లి బాబా ఆలయంలో కార్తిక దీపోత్సవం

మండవల్లి: స్థానిక షిర్డీసాయిబాబా ఆలయ ఆవరణలో గురువారం రాత్రి కార్తిక దీపోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు బాబాను దర్శించుకున్నారు. ఆలయ నిర్వాహకులు గుడివాడ చిట్టిబాబు, యిన్నా వెంకటేశ్వరరావు, పెరుమాళ్ల సత్యనారాయణ పాల్గొన్నారు.

మత్స్య పరిశ్రమకు ఉజ్వల భవిష్యత్తు

ఘంటసాల: మత్స్య పరిశ్రమకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డాక్టర్ డి.సుధారాణి అన్నారు. ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం.. ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రంలో ప్రపంచ మత్స్య దినోత్సవ కార్యక్రమాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. డాక్టర్ సుధారాణి మాట్లాడుతూ మత్స్యకారులకు గుర్తింపు అందించడానికి, ఆరోగ్యకరమైన సముద్ర పర్యావరణ వ్యవస్థల ప్రాముఖ్యతను తెలియజేయడానికి దినోత్సవం జరుపుకుంటున్నట్లు చెప్పారు. కేవీకే మత్స్య శాస్త్రవేత్త జె.యశ్వంత్ కుమార్ మాట్లాడుతూ చెరువుల్లో చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులను తెలియజేశారు. డాక్టర్ మంజువాణి, డాక్టర్ రేవతి పాల్గొన్నారు.

ఎముకల సమస్యపై ముందస్తు జాగ్రత్త ఉండాలి



అవగాహన సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ సందీప్

కైకలూరు: మారుతున్న జీవన పరిస్థితులకు తగినట్లుగా ఎముకల సమస్యలపై ప్రతి ఒక్కరూ ముందుస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఏలూరు ప్రభ హాస్పటల్ ఆర్థోపెడిక్ ఎండీ డాక్టర్ సునీల్ సందీప్ సూచించారు. కైకలూరు ఏరియా గ్రామీణ వైద్యుల సంఘం వైద్యులకు ప్రభ హాస్పటల్ సౌజన్యంతో స్థానిక షణ్ముఖ మినీ ఫంక్షన్ హాలులో అవగాహన సమావేశం గురువారం నిర్వహించారు. కైకలూరు ఏరియా గ్రామీణ వైద్యుల సంఘం అధ్యక్షుడు ఎం.విజయ్ కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో డాక్టర్ సందీప్ మోకాలు జాయింట్ రీప్లెస్‌మెంట్‌పై అవగాహన కలిగించారు. కాళ్ల కీళ్లు అరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆర్ఎంపీలకు వివరించారు. అనంతరం సంఘం తరపున డాక్టర్‌ను సన్మానించారు. కార్యక్రమంలో స్థానిక సంఘ సెక్రటరీ ఎల్.రవి, ట్రెజరర్ జనార్థన్, జిల్లా అధ్యక్షుడు వెంకటరాజు, జిల్లా సెక్రటరీ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

సాయి మాలధారుల భిక్షాటన

మండవల్లి: మండవల్లిలో గురువారం సాయిబాబా భక్తులు భిక్షాటన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు ఇంటింటికీ వెళ్లి సాయిబాబా మాదిరిగా భిక్షాటన చేశారు. కొందరు భక్తులు వీరిని తమ ఇంటి వద్దకు రమ్మని ఆహ్వానించారు. 41 రోజుల అనంతరం ఈ నెల 26న షిర్డీ వెళ్లనున్నట్లు సాయి మాలధారులు చెప్పారు.

ధాన్యం అమ్మిన 48 గంటల్లో నగదు జమ

ఘంటసాల: రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం అమ్మిన రైతులకు 48 గంటల్లో నగదు జమ అవుతాయని మండల వ్యవసాయశాఖ అధికారి కె.మురళీ కృష్ణ తెలిపారు. ఘంటసాల వెలుగు కార్యాలయంలో తహసీల్దార్ బి.విజయ ప్రసాద్ అధ్యక్షతన రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలుపై గ్రామ స్థాయి కమిటీ సభ్యులు, ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు పీఏసీఎస్ సీఈవోలు, డీసీఎంఎస్‌లతో గురువారం సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ విజయ ప్రసాద్ మాట్లాడుతూ రైతులకు ఎటువంటి ఇబ్బందుల్లేకుండా సజావుగా ధాన్యం సేకరణ చేయడానికి గ్రామ, మండల స్థాయి కమిటీలను వేసినట్లు చెప్పారు. ఏవో మురళీ కృష్ణ మాట్లాడుతూ రైతులు తప్పని సరిగా రైతు సేవా కేంద్రాల్లో షెడ్యూలింగ్ చేయించుకుని జీపీఎస్ ఉన్న వాహనం ద్వారా ట్రక్ షీట్‌తో ధాన్యాన్ని మిల్లర్లకు తరలించిన వారికే 48 గంటల్లో నగదు జమ చేస్తారన్నారు. రైతుల ప్రతినిధి వేమూరి సాయి వెంకట రమణ, వీపీఏలు, పీఏసీఎస్ సెక్రటరీలు, రైతు ప్రతినిధులు, మిల్లర్లు పాల్గొన్నారు.